# సాక్షి అనకాపల్లి

శనివారం । 15 । మార్చి । 2025




## అప్పన్న పెళ్లికి ముహూర్తం ఖరారు

సింహాద్రి అప్పన్న కల్యాణోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 30న ఉగాది రోజు పెళ్లిరాట ఉత్సవం, వచ్చే నెల 8 కల్యాణం నిర్వహించనున్నారు. 8లో



## ఆనందాల కేళి

అనకాపల్లి: హోలీ పండగను జిల్లా అంతటా ఆనందోత్సాహాలతో చేసుకున్నారు. రంగులు జల్లుకొని కేరింతలు కొడుతూ యువత ఉత్సాహంగా గడిపారు.

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ | సహర్ |
|---|---|---|
| | శని | ఆది |
| అనకాపల్లి | 6.11 | 4.50 |
| నర్సీపట్నం | 6.13 | 4.48 |

# మాయాబజార్

**సాక్షి విజిట్**

- తూకంలో తేడాలు.. జనం జేబుకు చిల్లులు
- కిలోకు 100 గ్రాముల వరకు తగ్గుదల
- డిజిటల్ వేయింగ్ మెషీన్‌లోనూ మోసాలు
- తూతూమంత్రంగా లీగల్ మెట్రాలజీ దాడులు
- మార్కెట్‌లో 30 శాతానికి పైగా మోసపూరిత వ్యాపారులే..
- వినియోగదారుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడి



కళ్ల ముందే కనికట్టు.. తూకంలో తేడాలున్నా కనిపెట్టకుండా హస్తలాఘవం.. కూరగాయలు, కిరాణా, బెల్లం, చేపలు, మాంసం, పండ్లు.. ఇలా ఏది కొన్నా అనకాపల్లిలో ఎంతో కొంత నష్టపోవలసిందే. తూనికలు కొలతల శాఖ అధికారులు ఉండే జిల్లా కేంద్రంలోనే యథేచ్ఛగా మాయ చేస్తున్నారంటే జిల్లావ్యాప్తంగా వినియోగదారులు ఎంత నష్టపోతున్నారో అర్థమవుతోంది. కళ్ల ముందే తూకంలో మోసం జరిగినా వినియోగదారులు గుర్తించలేని విధంగా వ్యాపారులు తమ చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో బెంబేలెత్తిపోతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలను తూకంలో తేడాలు మరింత కలవరపెడుతున్నాయి. నాణేనికి బొమ్మ, బొరుసు ఉన్నట్టే కచ్చితమైన తూకంతో అమ్మేవారూ ఉన్నారు. కానీ ఏది రైటో ఏది తప్పో తెలుసుకోలేని అయోమయ స్థితి నెలకొంటోంది. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' క్షేత్ర స్థాయి పరిశీలన చేసింది. ఇందులో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి.

సాక్షి, అనకాపల్లి/సాక్షి నెట్‌వర్క్:

శుక్రవారం ఉదయం 10 గంటలు.. సాక్షి విలేకరుల బృందం అనకాపల్లి మార్కెట్‌లో ఫీల్డ్ విజిట్ ప్రారంభించింది. వివిధ రకాలైన 95 దుకాణాలకు వెళ్లింది. ఇందులో 15 షాపుల వారు తూకం పరిశీలించేందుకు సహకరించలేదు. మిగతా 80 దుకాణాల్లో తూకం ఎలా ఉందో పరిశీలించగా 50 చోట్ల బాగానే ఉంది. 30 షాపుల్లో తేడాలు కనిపించాయి. 10 చోట్ల 30 గ్రాముల నుంచి 50 గ్రాముల వరకు తూకం తేడా ఉంది. 20 దుకాణాల్లో ఏకంగా 100 నుంచి 150 గ్రాముల వరకు వినియోగదారులు నష్టపోయేలా కాటాలు ఉన్నాయి. మార్కెట్‌లోని పెద్ద వ్యాపారస్తులు మాత్రమే ఎలక్ట్రానిక్ కాటాలను వాడుతున్నారు. సాధారణంగా ఇవి



కచ్చితంగా ఉంటాయని అందరి నమ్మకం. కానీ ఆధునిక సాంకేతికతతో ఈ వేయింగ్ మిషన్లతోనూ మాయ చేయవచ్చని సాక్షి పరిశీలనలో తేలింది. తూనికలు, కొలతల శాఖ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి సరిపెడుతున్నట్టు శుక్రవారం నాటి విజిట్‌లో అర్థమైంది.

## తప్పుల తక్కెడ



అనకాపల్లి మెయిన్ రోడ్‌లో కేజీ సపోటాలను తూకం వేస్తున్న యజమాని. (ఇన్‌సెట్) సాక్షి పరిశీలనలో 70 గ్రాముల బరువు తక్కువ చూపిస్తున్న వైనం

- అనకాపల్లి మార్కెట్‌వీధిలో ఒక కిలో కూరగాయలు కొని తూకం వేస్తే 150 గ్రాములు తేడా వచ్చింది. ఎందువల్ల తేడా వచ్చిందని అడిగితే.. కాటాను సరిచేశారు. ఇప్పుడు సరిగ్గా వచ్చింది.
- మెయిన్‌రోడ్డులో పండ్ల వ్యాపారి వద్దకు వెళ్లి ఒక కేజీ సపోట పండ్లు తీసుకుని తూకం వేస్తే 70 గ్రాములు తక్కువ చూపిస్తోంది. తక్కువగా వచ్చిందేమని అడిగితే మరో సపోటా వేశారు. ఇప్పుడు సరిపోయింది.
- నెహ్రూచౌక్, అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద గల విజయరామరాజు పేటలో ఓ మాంసం దుకాణానికి వెళ్లి కిలో చికెన్ తీసుకొని తూస్తే 100 గ్రాములు తక్కువ వచ్చింది. దీంతో దుకాణదారును 'సాక్షి' నిలదీయగా అప్పుడప్పుడు పొరపాటున చిన్న తేడా వస్తుందని చెప్పాడు.
- గవరపాలెంలో గల గాంధీమార్కెట్‌లో రోడ్డు కూడలి వద్ద ఉన్న ఒక కూరగాయల దుకాణం నుంచి కేజీ బెండకాయలు తూకం తూస్తే 50 గ్రాములు తక్కువగా చూపించింది.
- పలు దుకాణాల్లో బియ్యం బస్తా 26 కిలోలకు ధర చెల్లిస్తుండగా.. తూకం వేస్తే 25.5 కిలోలు మాత్రమే ఉంటోంది. దీనిపై బియ్యం వ్యాపారులను నిలదీస్తే బుకాయిస్తున్నారు.
- మెయిన్‌రోడ్డును అనుకుని ఉన్న బియ్యం షాపుల్లో బస్తాకు 25 కేజీల చొప్పున ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. ఇందులో 200 నుంచి 300 గ్రాములు తక్కువగా ఉంది. వ్యాపారులను అడిగితే తమకు మిల్లర్లు, హోల్‌సేల్ షాపుల నుంచి వస్తాయని చెబుతున్నారు. ఈ ప్యాకింగ్‌లు తామేమీ చేయమని, హోల్‌సేల్ షాపుల నుంచి కొనుగోలు చేస్తామని చెప్పారు.

## డిజిటల్ వేయింగ్ మెషీన్లలోనూ మోసం

డిజిటల్ వేయింగ్ మెషీన్‌లోనూ మోసం చేసే ఆస్కారముంది. మెషీన్ క్యాలిబ్రేషన్ సెట్ చేయడం ద్వారా 1000 గ్రాములకు వారు అనుకున్నంత 900, 800 గ్రాముల వరకు సెట్ చేసుకోవచ్చు. ఇది ఒకసారి సెట్ చేస్తే అలానే ఉంటుంది. అదేవిధంగా ఎలక్ట్రానిక్ యంత్రాన్ని లీటర్ మోడ్‌లో పెట్టి తూకం చేస్తున్నారు. అందులో వెయ్యి గ్రాములు కాకుండా వెయ్యి అని మాత్రమే చూపిస్తోంది.

## తక్కెడలు, తూకపు రాళ్ల లెక్కలు లేవు..

జిల్లా కేంద్రంలో తూనికలు, కొలతల శాఖ కార్యాలయం ఉంది. ఒక అసిస్టెంట్ కంట్రోలర్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. నెలలో ఒక్కసారైనా దుకాణాల్లో తనిఖీలు చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వ్యాపారులకు ఇష్టారాజ్యంగా మారింది. తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలకు వస్తున్నారన్న సమాచారం ముందుగా తెలిసి వ్యాపారులు పాత రాళ్లను దాచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంతమంది చిరు, బడా వ్యాపారుల వద్ద ముద్రలు వేసిన ఎలక్ట్రానిక్ కాటాలు, ఇనుప తక్కెడలు, తూకాలు చేసే రాళ్లు ఉన్నాయనే లెక్కలు అధికారుల వద్ద లేకపోవడం కొసమెరుపు.

## స్టాంపులు వేసిన రాళ్లు అంతంతమాత్రం

చాలా దుకాణాల్లో ముఖ్యంగా కూరగాయల మార్కెట్ విక్రయదారుల్లో ఎక్కువ మంది వద్ద స్టాంపులు వేసిన తూకం రాళ్లు కనిపించవు. ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ అనేక మంది వ్యాపారులు ఇంకా పాతతరపు త్రాసులనే వాడుతున్నారు. తూకం రాళ్లలో ఏ1 రకం (సరైన రాళ్లు), ఏ2 రకం (నాశిరకం రాళ్లు) ఉంటున్నాయి. వ్యాపారులు తూకం వేసేటపుడు ప్రశ్నించేవారు ఉన్నపుడు ఏ1-రకం రాళ్లు, మిగిలిన సమయాల్లో ఏ2-రకం రాళ్లు వినియోగిస్తున్నారు.

## కచ్చితంగా తూకం వేస్తున్న దుకాణాలూ ఉన్నాయి..

- అనకాపల్లి రామచంద్ర థియేటర్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన శివరామకృష్ణ స్వీట్స్ షాపులో 'సాక్షి' ఒక కేజీ మిక్సర్, ఒక కేజీ స్వీట్ తీసుకొని తూకం వేయగా.. ఒక్క గ్రాము కూడా తేడా లేకుండా సరిసమానంగా వచ్చింది. దుకాణ యాజమాని పతివాడ రామకృష్ణ మాట్లాడుతూ.. మోసం లేకుండా అమ్మితే వినియోగదారుల్లో విశ్వాసం పెరుగుతుందని, దీర్ఘకాలంలో వ్యాపారాభివృద్ధికి అది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.



కిరాణా దుకాణంలో కేజీ కందిపప్పు తూకం వేసి చూపిస్తున్న యజమాని సురేష్, (ఇన్‌సెట్) సాక్షి పరిశీలనలో బరువు సరిపోయిన కందిపప్పు

- గాంధీ మార్కెట్‌లో సురేష్ కిరాణా హోల్‌సేల్ షాపునకు వెళ్లి ఒక కేజీ కందిపప్పు తూకం వేయగా సరిగా ఉంది.
- అనకాపల్లిలో సిద్ధి లింగేశ్వరరావుస్వామి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీజయలక్ష్మి ఎంపోరియం టీ పొడి షాపులో ఒక కేజీ టీ పొడి తూకం తూయగా సమానంగానే వచ్చింది.
- గాంధీ మార్కెట్‌లో బెల్లం షాపులో 9.5 కేజీ బెల్లం దిమ్మ తూకం వేయగా సరిగానే ఉంది
- గాంధీ మార్కెట్‌లో కూరగాయలు అమ్మే మహిళా వ్యాపారి దగ్గర ఒక కేజీ బెండకాయలు తూకం వేయగా.. 20 గ్రాములు తక్కువగా వచ్చింది. మరో రెండు బెండకాయలు వేయగా తూకం సరిపోయింది.

## జిల్లాలో వివరాలు ఇలా..

2024-25 ఏడాదికి గానూ స్టాంపింగ్ చేయడం ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం
రూ. **61,80,649**

జరిమానాల ద్వారా వచ్చిన ఆదాయం
రూ.**38,02,900**

వ్యాపారులపై నమోదైన కేసులు
**562**

## ఫిర్యాదు చేయాల్సింది వీరికే..

వినియోగదారుడిని వ్యాపారులు మోసం చేసినా.. తూకంలో మోసాలకు పాల్పడినా తక్షణమే ఈ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.

రామచంద్రయ్య,
అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ,
అనకాపల్లి జిల్లా 93989 89565

భాస్కరరావు, అనకాపల్లి ఇన్‌స్పెక్టర్
9398124303

అనూరాధ, నర్సీపట్నం ఇన్‌స్పెక్టర్
9398132730

**టోల్ ఫ్రీ నెంబర్: 1967**

## వినియోగదారులు ఫిర్యాదు చేస్తే చర్యలు..



తూనికలు, కొలతలకు సంబంధించి ప్రజలు ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు ప్రతి వస్తువు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఎలక్ట్రానిక్ తూకంపై ప్రతి ఏటా ముద్ర వేస్తారు. ఉందా.. లేదా పరిశీలించుకోవాలి. దీనిపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పెట్రోల్, డీజిల్ పోయించుకునేటప్పుడు జీరో రీడింగ్ చూసుకోవాలి.

–భాస్కరరావు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్, అనకాపల్లి

## న్యూస్‌రీల్

### నేటితో ముగియనున్న డీఎస్సీ కోచింగ్ వెబ్ ఆప్షన్స్

**తుమ్మపాల:** డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం ఈ నెల15 లోగా వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి కె.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన షార్ట్ లిస్టు చేసిన అభ్యర్థులు వారి ప్రాధాన్యతల ప్రకారం కోచింగ్ సంస్థలు కేటాయించడానికి 'సర్వీస్ జన్మభూమి https://mdfc.apcfss.in వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. షార్ట్‌లిస్ట్ చేసిన ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులు కోచింగ్ సెంటర్ ఎంచుకోవడానికి తమ ప్రాధాన్యతను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

### 31తో ముగియనున్న గురుకుల విద్యాలయాల ప్రవేశ గడువు

**తుమ్మపాల:** గురుకుల పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ వి.వి.రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో గల గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతులు, ఇంటర్ ప్రథ మ సంవత్సరం, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరడానికి ఈనెల 1న ప్రారంభమైన దరఖా స్తుల స్వీకరణ 31 వరకు కొనసాగుతుందన్నా రు. దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో https://aprs.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 25న ఉదయం, కళాశాలలో ప్రవేశాలకు అదేరోజు మధ్యాహ్నం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు.

### ఉపమాక వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు



**నక్కపల్లి:** బీజేపీ నుంచి ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన సోము వీర్రాజు శుక్రవారం ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు గోత్ర నామాలతో పూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్యాణోత్సవాల్లో స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని వీర్రాజు పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పరమేశ్వరరావు, గాంధీ, కోసూరు శ్రీను ఉన్నారు.

# నేత్రపర్వం.. వెంకన్న చక్రతీర్థం





చక్ర పెరుమాళ్లకు సముద్రంలో స్నానమాచరింపజేసిన అర్చకస్వామి, సాగర జలాలతో అభిషేకించిన అనంతరం మధుపర్కాలతో దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి:

వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఉపమాక వెంకన్న చక్రవారి స్నానం శుక్రవారం ఘనంగా జరిగింది. పౌర్ణమినాడు వేంకటేశ్వరస్వామి అత్తవారింటికి (సముద్రుడి) వెళ్లే సన్నివేశాన్ని చక్రవారి స్నానంగా పిలుస్తారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామిని రాజాధిరాజవాహనంపై ఉంచి రాజయ్యపేట సముద్రతీరానికి తీసుకెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిట్లో స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి, చక్రపెరుమాళ్లను సముద్ర తీరానికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి సముద్ర జలాలను తీసుకొచ్చి స్వామివారికి అభిషేకించారు. సాగర జలాలతో అభిషేకం అనంతరం సాయంకాల తిరువారాధన, స్వప్న తిరుమంజనం అనంతరం నాలాయిర సేవాకాలంలో ఆరాధన, ప్రసాద నివేదన కార్యక్రమాలు జరిగాయి. స్వామివారి చక్రవారి స్నానం సందర్భంగా పలువురు భక్తులు సముద్రంలో స్నానం చేసేందుకు పోటీ పడ్డారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు తోడపెద్దులు, అమ్మవారి ఘటాలను తీసుకువచ్చి సముద్ర స్నానమాచరింపచేశారు. అనంతరం స్వామివారిని ఆలయానికి తీసుకు వచ్చి ఆలయంలో అద్దాల మండపంలో స్వామివారికి డోలోత్సవం (అద్దపు సేవ) నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళలు, చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది.

### నాగవల్లి వసంతోత్సవానికి పోటెత్తిన భక్తులు

**బుచ్చెయ్యపేట:** వడ్డాది వేంకటేశ్వరస్వామి నాగవల్లి వసంతోత్సవానికి భారీగా భక్తులు తరలివచ్చారు. వేంకటేశ్వరస్వామి 152వ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు శుక్రవారం జరిగిన ఈ వేడుక నేత్రపర్వంగా సాగింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండపై కొలువైన వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను కొండ దిగువకు దించి గజ గరుడ వాహనాలపై ఉంచి వడ్డాది పుర వీధుల్లో తిరువీధి వసంతోత్సవం నిర్వహించారు. సన్నాయి, మేళతాళాలతో డప్పులు, వాయిద్యాల నడుమ వేలాది మంది భక్తులు రంగులు పులుముకుంటూ స్వామివారిపై రంగులు జల్లి ఆనందంతో పులకించారు. అనంతరం వసంతాన్ని తమపై జల్లుకుని భక్తిభావంలో స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. భక్తులు స్వామి రథం వెంట పురవీధుల్లో తిరుగుతూ భక్తి పాటలు పాడుతూ, భజనలు చేస్తూ ఉత్సాహంగా డాన్స్‌లు చేస్తూ స్వామిపై ఉన్న భక్తిని చాటుకున్నారు. సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వడ్డాది శారదా నదిలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా వేదపండితుల



వడ్డాదిలో గరుడ వాహనంలో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

సమక్షంలో ఈవో శర్మ, ఆలయ సిబ్బంది చక్రస్నానం చేయించారు. స్వామివారితో పాటు పలువురు భక్తులు శారదా నదిలో స్నానాలు ఆచరించారు. ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఉత్సవ విగ్రహాలను గిరిజాంబ కొండపైకి చేర్చారు. రాత్రికి ఆలయం వద్ద భారీ మందుగుండు సామగ్రి కాల్చివేత భక్తులకు కనువిందు చేసింది. వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్‌లో వర్తక సంఘం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



వడ్డాది పురవీధుల్లో వేంకటేశ్వరస్వామికి తిరువీధి ఉత్సవం



వసంతోత్సవంలో రంగులు పులుముకుంటున్న యువకులు

# ఫిర్యాదు చేస్తే 90 రోజుల్లో పరిష్కారం

- చట్టాలపై అవగాహనతో మోసాలకు చెక్
- ఈ–జాగృతితో మరింత వెసులుబాటు
- జిల్లా వినియోగదారుల ఫోరం–1 ప్రెసిడెంట్ తనూజరెడ్డి



**సాక్షి ఇంటర్వ్యూ**

**సాక్షి, విశాఖపట్నం:** చట్టాలపై ప్రజలు అవగాహన పొందడం ద్వారా మోసపోకుండా ఉండవచ్చని జిల్లా వినియోగదారుల ఫోరం–1 ప్రెసిడెంట్ జి.తనూజరెడ్డి అన్నారు. వస్తు సేవలు, నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణాలు, ఇలా ఎందులో మోసం జరిగిందని భావించినా.. నిరభ్యంతరంగా జిల్లా వినియోగదారుల మండలిని ఆశ్రయించవచ్చని సూచించారు. ఎవరైనా.. ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేసే సాంకేతికత ఈ–జాగృతి పేరుతో అందుబాటులోకి వస్తోందని వెల్లడించారు. వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి'తో పలు అంశాలను ఆమె వివరించారు.

### ఫిర్యాదు చేయడం ఎలా అంటే?

వినియోగదారుల మండలికి ఫిర్యాదు చేసే విధానం చాలా సులువు. తెల్ల కాగితం ఫిర్యాదు వివరాలు రాసి పంపవచ్చు. ఏ న్యాయవాది అవసరం లేకుండా నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఇక్కడ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. మీరెలా మోసపోయారో చెబితే అంతా వారే సహకారం అందిస్తారు. అన్ని రకాల వస్తువులపై ఫిర్యాదు చేసే హక్కు వినియోగదారులకు ఉంది. లోపాలు, ఇబ్బందులు తలెత్తితే వస్తువు కొన్న రెండేళ్ల లోపు ఫిర్యాదు చేయాలి. ఆలస్యమైతే పూర్తి ఆధారాలతో డిలే పిటిషన్ వేచవచ్చు. ప్రతివాది సంస్థ నోటీసులు అందిన 45 రోజుల్లో కౌంటర్ ఫైల్ చేయకపోతే.. తదుపరి ప్రొసీడింగ్స్ లేకుండానే కేసు పరిష్కృతమయ్యే అవకాశం ఉంది.

### బిల్లు తప్పకుండా తీసుకోవాలి

వినియోగదారుడు ఏదైనా వస్తువును కొన్న తర్వాత బిల్లు తప్పకుండా తీసుకోవాలి. ఇదే ప్రాథమిక ఆధారం. అప్పుడే కేసు స్వీకరించేందుకు అవకాశం ఉంటుంది. వస్తు సేవల్లో నాణ్యత కొరవడినా, నష్టపోయినా పరిహారం పొందవచ్చు. రూ.5లక్షల లోపు వస్తువు ధర ఉంటే ఎలాంటి రుసుం లేకుండా వినియోగదారుల ఫోరం(కోర్టు)లో కేసులు వేయవచ్చు. రూ.5 లక్షలపైబడి ఉంటే.. రూ.400 నుంచి రూ.2 వేల వరకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

### ప్రతి నెలా 30 నుంచి 40 ఫిర్యాదులు

ప్రతి నెలా 30 నుంచి 40 ఫిర్యాదులొస్తుంటాయి. ఇందులో టూ వీలర్, ఫోర్ వీలర్, వాటర్ ఫిల్టర్, గ్యాస్, పెట్రోల్ దుకాణాలు, ధరల వ్యత్యాసం, బీమా, వైద్యం వంటి ఎక్కువగా ఉంటాయి. వచ్చిన ఫిర్యాదుల్లో బీమా కంపెనీల మోసాలపై 50 శాతం వరకు ఉండగా.. మోటర్ వాహనాలపై 30 శాతం ఉంటున్నాయి. ప్రస్తుతం వస్తున్న ఫిర్యాదుల్లో న్యాయవాది సాయంతో వస్తున్న ఫిర్యాదులే అధికంగా ఉన్నాయి.

### 90 రోజుల్లో పరిష్కారం

పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తే.. 90 రోజుల్లో పరిష్కృతమై వినియోగదారుడికి పరిహారం అందించగలుగుతున్నాం. కొన్ని కేసులు మాత్రం ఎక్కువ సమయం పడుతున్నాయి. ప్రతి నెలా 30 కిపైగా కేసులు పరిష్కరిస్తున్నాం. ఇప్పటి వరకూ 190 కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

### పరిధి లేదు.. ఫిర్యాదు చేయవచ్చు

ఒకప్పుడు ఎక్కడ వస్తువు కొనుగోలు చేస్తే ఆ పరిధిలోనే ఫిర్యాదు చేసేవారు. చట్టంలో వచ్చిన మార్పులు వినియోగదారుడికి వెసులుబాటు కల్పిస్తున్నాయి. ఎవరు ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయవచ్చు. త్వరలోనే ఈ–జాగృతి అమల్లోకి రానుంది. అంటే పేపర్‌లెస్ విధానం. ప్రొసీడింగ్స్ మొత్తం ఆన్‌లైన్‌లోనే ఉంటాయి.

### భయపడకుండా రావాలి

అన్యాయమైన వాణిజ్య విధానాలు, మోసపూరిత పద్ధతుల నుంచి న్యాయబద్ధమైన రక్షణ పొందడం వినియోగదారుల హక్కు. జిల్లా వినియోగదారుల ఫోరం ద్వారా నష్ట పరిహారం రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు, రాష్ట్ర కమిషన్ ద్వారా రూ. కోటి నుంచి రూ. 10 కోట్ల వరకు పొందవచ్చు. రూ.10 కోట్లు దాటితే జాతీయ వినయోగదారుల కమిషన్‌లో కేసులు వేసుకునే అవకాశం ఉంటుంది. మోసం జరిగిందని గుర్తిస్తే ప్రతి ఒక్కరూ భయపడకుండా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలని కోరుతున్నాం.

## యథేచ్ఛగా పెట్రోల్, డీజిల్ కల్తీ 8లో

## క్లుప్తంగా

### అనకాపల్లి నూకాంబికా అమ్మవారి దేవస్థానం ఈవోగా వెంపలి



**మహారాణిపేట:** అనకాపల్లిలోని శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సింహాచలం దేవస్థానంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వెంపలి రాంబాబు నియమితులయ్యారు. శ్రీ కనక మహాలక్ష్మి ఆలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రాంబాబును ఇటీవల సింహాచలం దేవస్థానం అసిస్టెంట్ కార్యనిర్వహణాధికారి (ఏఈవో)గా బదిలీ చేశారు. ఆయనకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి లభించడంతో అనకాపల్లి దేవస్థానానికి సహాయ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)గా నియమించారు. ప్రస్తుతం నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం ఇన్చార్జి ఈవోగా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) ఎస్.సుజాత పని చేస్తున్నారు. శనివారం వెంపలి రాంబాబు ఈవోగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలున్నాయి.

### చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతు



జగన్ (ఫైల్)

**అచ్యుతాపురం రూరల్ :** పూడిమడక శివారు కడపాలెం గ్రామానికి చెందిన మేరుగు జగన్ (20) సముద్రంలో వేటకు వెళ్లి వల వేస్తుండగా జారి సముద్రంలో పడిపోవడంతో గల్లంతై మృతి చెందినట్లు మత్స్యకారులు తెలిపారు. శుక్రవారం ఉదయం సుమారు 9.30 గంటలకు వెళ్లిన మత్స్యకారులు రాంబిల్లి మండలం వెంకయ్యపాలెం, సీతపాలెం పారుగు ప్రాంతాల్లో వల వేసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు సముద్రంలో జారి పడిపోయిట్లు మత్స్యకారులు తెలిపారు. జగన్ మృతితో పూడిమడక గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహం గల్లంతవడంతో మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు.

### ఉక్కు ఎస్ఎంఎస్‌లో ప్రమాదం

**ఉక్కునగరం :** స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్)-2 విభాగంలో శుక్రవారం ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ ఉద్యోగికి గాయాలయ్యాయి. కార్మిక నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఎంఎస్-2 విభాగం కన్వర్టర్స్‌లోని హాట్‌మెటల్ చెక్ చేసే సమయంలో ఒక్కసారిగా స్లాగ్ బయటకు తుల్లింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి బలిరెడ్డి పెంటయ్యపై స్లాగ్ పడటంతో గాయపడ్డాడు. బాధితుడిని ఉక్కు జనరల్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



# యథేచ్ఛగా పెట్రోల్, డీజిల్ కల్తీ

- మరమ్మతులకు గురవుతున్న వాహనాలు
- కొలతల్లో రీడింగ్ మోసాలు
- పట్టించుకోని తనిఖీ అధికారులు
- వినియోగదారుల ఆగ్రహం





బంకులో పెట్రోల్ పోస్తున్న దృశ్యం

**చోడవరం:** అసలే ఆకాశాన్నంటిన ధర.. ఆపై ఆయిల్ కల్తీ. నిఘా అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పెట్రోల్ బంకుల్లో కల్తీ యథేచ్ఛగా జరుగుతోంది. వినియోగదారుల క్షేమాన్ని వదిలేసి, కేవలం దోపిడీ భావంతోనే పెట్రోల్ బంకుల నిర్వాహకులు ఆయిల్ కల్తీ చేస్తున్నారు. దీంతో రూ.వేలు, లక్షలు పెట్టి కొనుగోలు చేసిన వాహనాలు మెకానిక్ షెడ్లకు చేరుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం ఆకాశాన్నంటడంతో వాహనాలపై తిరగడమే అందరికీ భారంగా మారింది. దీనికి ఆయిల్ కల్తీ కూడా తోడవడంతో మరమ్మతులకు గురైన వాహనాలకు పెట్టుబడులు పెట్టలేక వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో సుమారు 100కి పైగా పెట్రోల్, డీజిల్ బంకులు ఉన్నాయి. చోడవరం పరిసరాల్లోనే 15 బంకులు ఉన్నాయి. వీటిలో ఆయిల్ కల్తీ ఎక్కువగా జరుగుతోంది. పెట్రోల్, డీజిల్‌లో ఇథనాయిల్, ఇతర క్రూడాయిల్ కల్తీకి పాల్పడుతున్నారు. ఆయిల్ కల్తీతో పాటు కొన్ని బంకుల్లో భూమిలో ఉంచిన స్టోరేజ్ ఆయిల్ ట్యాంకర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల వర్షపు నీరు పెట్రోల్, డీజిల్ ట్యాంకుల్లో చేరి ఆయిల్‌లో కలిసిపోతుండగా ఆ కల్తీ ఆయిల్‌నే వాహనాలకు వేస్తున్నారు. ఇటీవల పెట్రోల్ బంకుల్లో ఈ తరహా కల్తీతో అనేక వాహనాలు మరమ్మతులతో మూలకు చేరాయి. చోడవరం, వెంకన్నపాలెం, వడ్డాది, రావికమతం, మాడుగుల, అనకాపల్లి, సబ్బవరం, యలమంచిలి, తాళ్లపాలెం, నర్సీపట్నం, పెందుర్తి ప్రాంతాల్లోని బంకుల్లో ఆయిల్ కల్తీ మరీ ఘోరంగా జరుగుతోంది. బంకులను ఎప్పటికప్పుడు పరిశీలించి, తనిఖీలు చేయాల్సిన విజిలెన్స్, రెవెన్యూ, తూనికలు-కొలతలు, పౌర సరఫరాల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఈ తనిఖీలు మొక్కుబడిగానే ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తనిఖీలు లేకపోవడం వల్ల పెట్రోల్ బంకుల యజమానులు ఇష్టారాజ్యంగా ఆయిల్ కల్తీకి, కొలతల్లో మోసాలకు పాల్పడుతున్నారని వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్తీ ఆయిల్‌తో మరమ్మతులకు గురైన వాహనాలు మార్గ మధ్యలోనే నిలిచిపోవడం వల్ల దూరప్రాంతాలకు వెళ్లే వారు, అత్యవసర పనులపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందుగా ఆయిల్ పంపింగ్ చేసే మిషన్ల వద్ద పాయింట్ల రీడింగ్‌లో ఎడ్జిస్టింగ్ చేస్తున్నారు. అసలే లీటర్ పెట్రోల్ ధర రూ. 108.41 ఉండగా డీజిల్ ధర రూ. 98 ఉంది. ఇంత ఎక్కువగా ధరలు పెరిగిపోయి ఆయిల్ వేయించుకోవడమే భారంగా మారిన పరిస్థితుల్లో రీడింగ్‌లో మోసాలు, ఆయిల్‌లో కల్తీతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. తక్షణం పెట్రోల్ బంకుల్లో ఆయిల్ కల్తీ, కొలతల్లో మోసాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని, కల్తీని అరికట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.



ఇంజిన్ మరమ్మతుతో మెకానిక్ షెడ్‌కు చేరిన బైక్

#### అధికారుల నిర్లక్ష్యమే కారణం..

చోడవరం దగ్గర బంకులో పెట్రోల్ కొట్టించాను. కొంచెం దూరం వెళ్లి ఇంజిన్ ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా స్టార్ట్ కాకపోవడంతో మెకానిక్ షెడ్‌కు తెచ్చాను. ఆయిల్ కల్తీ వల్లే ఇంజిన్ పట్టేసిందని మెకానిక్ చెప్పారు. పెట్రోల్ బంకుల్లో కల్తీని నివారించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్లే మా వాహనాలు పాడవుతున్నాయి. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.
– అప్పలనాయుడు, వాహనదారుడు, చోడవరం

#### ఆయిల్ కల్తీని అరికట్టాలి..

నేను కుటుంబ సభ్యులతో కలిసి విశాఖపట్నం బయలుదేరాను. వెంకన్నపాలెం సమీపంలోని ఒక బంకులో నా బైక్‌లో 2 లీటర్ల పెట్రోల్ కొట్టించాను. ఇక్కడ ఆయిల్ వేయించిన తర్వాత సైలెన్సర్ నుంచి పొగ ఎక్కువగా వచ్చింది. మెకానిక్ షెడ్‌కు తీసుకెళ్తే కల్తీ ఆయిలే కారణమని అన్నారు. రీడింగ్‌లో కూడా మోసం జరుగుతోంది. లీటర్ ఆయిల్ పూర్తిగా రావడం లేదు. బంకుల్లో ఆయిల్ కల్తీ, కొలతల్లో మోసాలను అరికట్టాలి.
– సీహెచ్ శ్రీనివాసరావు, వాహనదారుడు, చోడవరం

### అందరి చుట్టం.. వినియోగదారుల చట్టం



కన్జూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ

**సాక్షి, అనకాపల్లి:** కొనుగోలు చేసే ప్రజలందరికీ వినియోగదారుల రక్షణ చట్టం చుట్టంలా అండగా నిలుస్తుందని కన్జూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. 1986 నాటి వినియోగదారుల రక్షణ చట్టం (సీపీఏ) కారణంగా లక్షలాది మంది వినియోగదారుల ఫిర్యాదులు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుత మార్కెట్ ట్రెండ్స్‌లో మార్పు, ఈ కామర్స్ అభివృద్ధి, టెలీ మార్కెటింగ్, డైరెక్ట్ సేల్స్, ఆన్‌లైన్ ట్రేడింగ్, తప్పుదారి పట్టించే ప్రకటనలు, కల్తీ, వినియోగదారుల హక్కుల ఉల్లంఘనలు పెరిగిన నేపథ్యంలో 107 సెక్షన్లతో కొత్త వినియోగదారుల రక్షణ చట్టం-2020లో అమల్లోకి వచ్చిందన్నారు. కొన్న ప్రతి వస్తువుకు బిల్లు తప్పనిసరిగా తీసుకుంటేనే కేసు గెలిచేందుకు వీలుగా ఉంటుందని, అలాగే గ్యారంటీ లేదా వారంటీ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

**చట్టపరిధిలోకి వచ్చేవి ఇవే..**

బ్యాంకులు, ప్రైవేటు కంపెనీలు, విత్తనాల కంపెనీలు, ఇన్సూరెన్స్ కంపెనీలు, కొన్ని ప్రభుత్వ సంస్థలు, పురుగుల మందుల కంపెనీలు, ప్రైవేటు ఆస్పత్రులు, ఎయిర్‌లైన్స్, క్లినికల్ లేబొరేటరీలు, ట్రాన్స్‌పోర్టు కొరియర్ సర్వీసు, జీవిత బీమా, రైల్వే, గ్యాస్, ఎలక్ట్రిసిటీ, లే-అవుట్లు, గ్యాస్, లాయర్లు, అపార్ట్‌మెంట్లు, టూరిస్టు సర్వీసు, ఈ-కామర్స్, పోస్టల్ డిపార్ట్‌మెంట్, యూనివర్సిటీ, హౌసింగ్ బోర్డు, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, ఆర్టీసీ, ఇంటర్మీడియట్ బోర్డు వినియోగదారుని చట్టపరిధిలోకి వస్తాయి.

## క్వారీ లారీలు ఆపాలని రైతుల ఆందోళన





నల్లరాయి రవాణా చేస్తున్న లారీలు, ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతున్న రైతు సత్తిబాబు (ఫైల్)

**రోలుగుంట:** రోజురోజుకు క్వారీ యాజమాన్యానికి, స్థానిక రైతుల మధ్య వివాదం తీవ్రతరం అవుతున్నా అధికారులు, స్థానిక నాయకులు చోద్యం చూస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు నష్టం చేకూర్చే క్వారీలు ఆపండని బాధిత రైతులు కోరుతున్నా నాయకులు పట్టించుకోవడంలేదు. తమకు ప్రభుత్వ అనుమతి ఉందని, స్థానిక నాయకులతో సత్సంబంధాలున్నాయని, మీరేం చేసుకుంటారో చేసుకోండి అంటూ క్వారీ యాజమాన్యం చెప్పడంతో శరభవరం, రాజన్నపేట, గొల్లపేట, వడ్డిప గ్రామాల రైతులు తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం వరకూ సుమారు 25 రోజుల పాటు నల్లరాయి రవాణా ఆపిన యజమాన్యం తిరిగి దానిని కొనసాగించింది. దీంతో పలువురు రవాణా ఆపాలి, కొండలు పేల్చడం మానేయాలంటూ యాజమాన్యాన్ని కోరారు. అయితే వారు దీన్ని పట్టించుకోలేదు. లారీల్లో డ్రైవర్లుగా సమీప గ్రామస్తులకు అవకాశం కల్పించి ఉపాధికి తోడ్పాటునందిస్తున్నాం అంటూ చెబుతున్నారు.

దీంతో యాజమాన్యానికి, సమీప గ్రామాల రైతులకు వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శరభవరం గ్రామానికి చెందిన జలుమూరి సత్తిబాబు అనే రైతు మానసిక వ్యధతో మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యం అందించడంతో కోలుకోగా గురువారం రాత్రి సత్తిబాబుని పంపించేశారు. దీంతో బాధిత గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ప్రజా సంఘాల మద్దతు తీసుకుని ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

### వైభవంగా గౌర పూర్ణిమ ఉత్సవాలు



పుష్పాలంకరణలో రాధాకృష్ణులు

**కొమ్మాది :** బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో శుక్రవారం గౌర పూర్ణిమ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గౌర పూర్ణిమ శ్రీ కృష్ణభగవానుని భక్త అవతారమైన శ్రీ చైతన్య మహా ప్రభు ఆవిర్భావ దినోత్సవంగా నిర్వహించే సందర్భంగా సాయంత్రం 5 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీ కృష్ణుని భజన సంకీర్తనలు, పుష్పాభిషేకం నిర్వహించారు. గౌర పూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా చైతన్య లీలల్లో ఒకటైన చాంద్‌కాజీ ఉద్ధరణ నాటకం అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని, వంశీకృష్ణ ప్రభు, భక్తులు పాల్గొన్నారు.

### చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

**మునగపాక:** మండలంలోని మూలపేటకు చెందిన దొడ్డి మహేశ్వరరావు (68) చెట్టుపై నుంచి పడి శుక్రవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మూలపేటకు చెందిన మహేశ్వరరావు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం చింత చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ జారి పడ్డాడు. దీంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందాడు. మృతుడు మహేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న మహేశ్వరరావు మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

## ఎంఎస్ఎంఈతో మెండుగా ఉపాధి అవకాశాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట అప్పారావు

**తుమ్మపాల:** సాంకేతిక విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ విద్యా సంస్థలను ఏర్పాటు చేసిందని, తద్వారా విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని అచ్యుతాపురంలో గల ఎంఎస్ఎంఈ విద్యా సంస్థ అధ్యాపకులు డాక్టర్ కె.వెంకట అప్పారావు అన్నారు. పట్టణంలో గల మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. అచ్యుతాపురంలో ఉన్న పారిశ్రామిక వాడలో అన్ని సౌకర్యాలతో ఎంఎస్ఎంఈ విద్యా సంస్థ ఏర్పాటు చేశారన్నారు. టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు ఇక్కడ డిప్లమో కోర్సులో ప్రవేశ పొందడం ద్వారా ప్రఖ్యాత పరిశ్రమల్లో ఉపాధి పొందవచ్చని తెలిపారు. అదే విధంగా బీటెక్‌లో కూడా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ కూడా విద్యార్థుల పొందవచ్చన్నారు. ప్రవేశ పరీక్షకు ప్రస్తుతం ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉందని, ఏప్రిల్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంట్రన్స్ పరీక్ష మే 4న ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు, హిందీ అధ్యాపకులు మహేంద్రనాథ్ పట్నాయక్, ఆంగ్ల అధ్యాపకురాలు సుహాసిని, పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ కర్రి గంగాధర్, 10వ తరగతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్లకు పదోన్నతులు కల్పించాలి



కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో రవికుమార్ తదితరులు

**తుమ్మపాల:** గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్‌గా ప్రభుత్వ సర్వీస్‌లో చేరిన ఉద్యోగి ఎటువంటి పదోన్నతి లేకుండానే రిటైర్ అవుతున్నాడని, ల్యాబ్ టెక్నీషియన్లకు ప్రమోషన్లు కల్పించాలని మెడికల్ లేబొరేటరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గీతారాణి డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డీఎంహెచ్‌వో రవికుమార్, డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసరావు, సీఎస్ ఆర్ఎంవో గౌతమ్, అల్లూరి జిల్లా డీసీహెచ్‌ఎస్ కృష్ణారావు విచ్చేసి ల్యాబ్ టెక్నీషియన్లకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా గీతారాణి మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలపై అధికారులకు వివరించారు. వారికి పని భారం తగ్గించే విధంగా ప్రతి పీహెచ్‌సీలో అదనంగా మరో పోస్టు భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు భరోసాగా క్రమబద్ధీకరణ కొనసాగించాలన్నారు. అన్ని విభాగాల్లో ల్యాబ్ టెక్నీషియన్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎంఎస్ శంకరరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



### అట్టహాసంగా జాతీయ నాటకోత్సవాలు ప్రారంభం



మా ఇంట్లో మహాభారతం నాటికలో ఓ సన్నివేశం

**మురళీనగర్:** కేవీ మెమోరియల్ ఆర్ట్స్, విశాఖ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో మురళీనగర్‌లోని వేములపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జాతీయస్థాయి ఆహ్వాన నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రదర్శించిన నాటికల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారాలు పొందిన రంగస్థల నటులు తమ నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ముందుగా గుంటూరు అభినయ ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన 'ఇంద్రప్రస్థం'యువతను ఆలోచింపజేసింది. నేటి యువత జీవితంలో స్థిరత్వం లేకుండా ప్రేమ, పెళ్లి మోజులో పడటం, అనంతరం జీవితంలో వారికి ఎదురయ్యే పరిణామాలు, వారి కష్టాలను కళ్లకు కట్టినట్లు నటీనటులు ప్రదర్శించారు. 'వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసి అందరూ డబ్బు మోజులో సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగాల్లోకి వెళ్లిపోతే రానున్న కాలంలో రైతులనేవారు కనిపించరు. దీని వల్ల తిండి కొరత ఏర్పడితే మానవ మనుగడ పరిస్థితి ఏమిటి?' అనే సందేశాత్మక అంశంతో చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ నటులు'మా ఇంట్లో మహా భారతం'నాటికను అద్భుతంగా ప్రదర్శించారు. రైలు ప్రమాదాలు జరిగినప్పుడు జనరల్ బోగీల్లో ఉన్న ప్రయాణికుల గురించి ఎవరూ పట్టించుకోరు. ఒక రైలు ప్రమాదం సమయంలో జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న తన కొడుకు ఆచూకీ తెలియక ఒక తల్లి అనుభవించే ఆవేదనను తెలిపే 'జనరల్ బోగీలు'నాటికను కొలకలూరు సాయి ఆర్ట్స్ బృందం ప్రదర్శించింది. పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, పి.వెంకట సూర్యనారాయణరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఆర్సీ-5 యు.శుభ, వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి సహకరించారు. శనివారం సాయంత్రం 6.15కు ఒంగోలు పండు క్రియేషన్స్ వారిచే 'పక్కింటి మొగుడు', రాత్రి 8.15 గంటలకు విశాఖ జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ మహిళలచే 'సంకల్పం'నాటికల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

### చేనుల అగ్రహారం కొట్లాట కేసులో నలుగురికి రిమాండ్

**తుమ్మపాల:** కొండుపాలెం పంచాయతీ చేనుల అగ్రహారంలో ఈనెల 9న శ్రీసత్తెమ్మ తల్లి పండగలో జరిగిన కోట్లాట కేసులో నలుగురికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ జి.రవికుమార్ శుక్రవారం తెలిపారు. కోట్లాటలో తీవ్ర గాయాలపాలైన మధుపాడ నర్సింగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారణ చేసి కేసు నమోదు చేశామన్నారు. నర్సింగరావు, ఆయన కుమారులపై మధుపాడ శ్రీనివాసరావు, రుత్విక్, కిషోర్, దుర్గాప్రసాద్‌లు దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో వారికి 15 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

**యలమంచిలి రూరల్:** మద్యం తాగొద్దని భర్త మందలించినందుకు మనస్థాపానికి గురైన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన యలమంచిలి మండలం రుక్మిణీపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పి. నాగరాజు ములకలాపల్లిలో సిమెంట్ కర్మాగారంలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతని భార్య మద్యానికి అలవాటు పడింది. గురువారం రాత్రి నాగరాజు ఇంటికి వచ్చేసరికి భార్య మద్యం మత్తులో కనిపించింది. ఇది చూసి ఆగ్రహానికి లోనైన నాగరాజు ఆమెను తీవ్రంగా మందలించాడు. మనస్థాపానికి గురైన ఆమె శుక్రవారం పొలానికి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. దీంతో భర్త హుటాహుటిన భార్యను యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. దీనిపై యలమంచిలి రూరల్ పోలీసులు ప్రభుత్వాస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు.

## సొంత గనుల కోసం కార్మికుల పోరాటం



జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద ధర్నా చేస్తున్న అఖిల పక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు

**సీతమ్మధార:** స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం మహా ధర్నా చేశారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా గురజాడ అప్పారావు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, గాజువాకలో తలపెట్టిన ధర్నాకు పోలీసులు అడ్డుపడి నాయకులను అక్రమంగా నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామన్నారు. తొలగించిన సుమారు 400 మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌లోని ఆఫీసర్లు, శాశ్వత ఉద్యోగులకు మూడు నెలల బకాయి జీతాలు విడుదల చేయాలని, స్టీల్‌ప్లాంట్ క్వార్టర్లలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో ఉద్యమాలు నిర్వహిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకుడు జె.అయోధ్యరామ్‌కు ఇచ్చిన షోకాజ్ నోటీసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, నాయకులు వై.రాజు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, పి.మణి, కె.ఎం.కుమార మంగళం, ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం, ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యులు ఎస్.కె.రెహమాన్, జె.డి.నాయుడు పాల్గొన్నారు.

# అప్పన్న పెళ్లికి ముహూర్తం ఖరారు

- ఈ నెల 30న ఉగాది రోజు పెళ్లిరాట
- ఏప్రిల్ 8న వార్షిక కల్యాణోత్సవం
- ఉద్యానవన మండపంలో ఘనంగా డోలోత్సవం
- శాస్త్రోక్తంగా వసంతాల సమర్పణ



స్వామికి పెళ్లి కుదిరిన ఆనందంలో భక్తులపై రంగులు చల్లుతున్న పురోహిత్ అలంకారి

**సింహాచలం:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి కల్యాణోత్సవానికి ముహూర్తం ఖరారైంది. వివాహం కోసం శుక్రవారం సింహగిరి నుంచి కొండ దిగువకు దిగి వచ్చి స్వామి.. పిల్లనివ్వమని తన సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని కోరారు. ఏం చూసి నీకు పిల్లనివ్వాలని తొలుత నిరాకరించిన అమ్మవారు.. ఆ తర్వాత స్వామి వైభవాన్ని, ఆయనకున్న అసంఖ్యాకమైన భక్తజనాన్ని చూసి ఆశ్చర్యపోయింది. చివరకు అమ్మవారు పిల్లనివ్వడానికి అంగీకరించింది. దీంతో ఈ నెల 30న ఉగాది రోజు పెళ్లిరాట ఉత్సవం, వచ్చే నెల 8వ తేదీ చైత్ర శుద్ధ ఏకాదశి నాడు స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. దీంతో సింహగిరిపై పెళ్లి సందడి నెలకొంది.

**ఘనంగా డోలోత్సవం**

ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి డోలోత్సవం ఘనంగా జరిగింది. ఏటా చైత్రశుద్ధ ఏకాదశి రోజున స్వామికి జరిగే వార్షిక కల్యాణోత్సవానికి ముందు వచ్చే ఫాల్గుణ పౌర్ణమి రోజు అడవివరంలో స్వామికి డోలోత్సవం విశేషంగా నిర్వహించడం ఆనవాయితీ. తనకు పిల్లనివ్వాలంటూ తన సోదరి అయిన పైడితల్లి అమ్మవారిని స్వామి అర్థించే విధానాన్నే అడవివరం గ్రామస్తులు బొట్టెనడిగే పున్నమి ఉత్సవం(డోలోత్సవం)గా అభివర్ణిస్తారు. కాగా.. కొండదిగువ పుష్కరిణి ఉద్యానవన మండపంలో ఈ ఉత్సవాన్ని దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవమూర్తులైన గోవిందరాజస్వామిని విశేషంగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా సింహగిరిపై నుంచి పల్లకీలో మెట్లమార్గం ద్వారా తొలిపావంచా వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్వామికి దేవస్థానం ఈవో కె.సుబ్బారావు దంపతులు, అధికారులు, గ్రామస్తులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి స్వామిని ఊరేగింపుగా పైడితల్లి అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ స్వామికి గ్రామస్తులు విశేషంగా హారతులుపట్టారు.

అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి ఉద్యానవన మండపంలో ఏర్పాటు చేసిన డోలీపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. చూర్ణోత్సవం, వసంతోత్సం నిర్వహించారు. పూజలు చేసిన వసంతాలను స్వామికి సమర్పించారు. అనంతరం నాళాయిర దివ్య ప్రబంధాన్ని ఆలపిస్తూ డోలోత్సవం నిర్వహించారు. తదుపరి స్వామికి సమర్పించిన వసంతాలను అర్చకులు భక్తులపై చల్లారు. స్వామికి పెళ్లికుదిరిన ఆనందంలో భక్తులు, దేవస్థానం ఉద్యోగులు ఒకరిపై ఒకరు వసంతాలను జల్లుకుని ఆనంద డోలికల్లో మునిగితేలారు. అనంతరం భక్తులకు పానకాన్ని ప్రసాదంగా అందజేశారు. తర్వాత అడవివరంలో తిరువీధి నిర్వహించారు. పెళ్లి కొడుకు అలంకరణలో తమ ఇంటిముందుకు వచ్చిన స్వామికి గ్రామస్తులు మంగళ హారతులిచ్చారు. తదుపరి స్వామిని మరల పైడితల్లి ఆలయానికి తీసుకెళ్లి అక్కడి నుంచి సింహగిరికి చేర్చారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఇన్‌చార్జి ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేద పండితులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, డిప్యూటీ ఈవో రాధ తదితరులు స్వామిని దర్శించుకున్నారు.



స్వామికి డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

# అసంపూర్తిగా సచివాలయ భవనాలు



శంకరంలో తుది దశలో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

- నిధులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- నిలిచిపోయిన హెల్త్ క్లినిక్, సచివాలయ, ఆర్‌బీకే నిర్మాణాలు
- సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న వైనం

**తుమ్మపాల:** గ్రామస్థాయిలోనే ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే వలంటీరు వ్యవస్థకు మంగళం పాడేయగా, తాజాగా అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయ భవనాలను పూర్తి చేసిన పాపాన పోలేదు. దాంతో వాటికి వెచ్చించిన ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితి నెలకొంది.

మండలంలో 26 సచివాలయాలున్నాయి. గత ప్రభుత్వ పాలనలో మేజర్ పంచాయతీ తుమ్మపాలలో కోటి రూపాయలు వ్యయం చేసి సచివాలయంతోపాటు రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు ఏర్పాటు చేశారు. ఇదే విధంగా అన్ని గ్రామాల్లో ఆర్బీకేతో పాటు హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. ఎన్నికలకు ముందు వరకు పనులు జరిగాయి. ఎన్నికల సమయంలో నిలిచిపోయిన భవనాలు పనులు నేటికీ ప్రారంభం కాలేదు. మేజర్ పంచాయతీ తుమ్మపాలలోనే ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌లు పిల్లర్లు, శ్లాబ్ వరకు మాత్రమే పరిమితమయ్యాయి.

**ఇరుకు గదుల్లోనే సేవలు**

జిల్లా, మండల కేంద్రాల చుట్టూ తిరిగే పనిలేకుండా గత ప్రభుత్వం ప్రజల కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లతో పాలనను పల్లె ముంగిటకు చేర్చింది. వాటి కోసం భవనాల నిర్మాణం చేపట్టింది. ఈ వ్యవస్థ నేడు ఆదరణ కోల్పోతోంది. పరిపాలన, వైద్యం, రైతు సేవా తదితరాలను ప్రజలకు చేరువ చేయాలని చేసిన సంకల్పం గాలిలో దీపంగా మారింది. వ్యవసాయపరంగా అన్ని రకాల సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్బీకేలు రైతు సేవా కేంద్రాలుగా మారాయి. నూతన భవనాలు మంజూరు లేక ఇరుకు గదుల్లోనే కొనసాగుతున్నాయి. వైద్యాన్ని పేదల ఇంటి ముంగిటకు చేర్చేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌లను సైతం కొన్ని గ్రామాల్లో పంచాయతీ గదులు, అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. గదిలో ఉద్యోగులందరూ పని చేయాల్సి వస్తోంది. ఫర్నిచర్ అదే గదిలో ఉండటంతో విధుల నిర్వహణకు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని భవనాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు.



అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు సేవా కేంద్రం

### కూటమి పాలనలో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం



వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోంది. ప్రతి గ్రామంలో ప్రజలు అందుబాటులో సేవలందించాలనే లక్ష్యంతో ఆర్బీకే, హెల్త్ క్లినిక్, సచివాలయ భవనాలు చేపడితే, వాటిని పూర్తి చేసేందుకు కూటమి నాయకులు నిధులు విడుదల చేయకపోవడం దారుణం.

– జి.రాము, శంకరం

### నూతన భవనాలు మంజూరు చేయాలి

గత ప్రభుత్వం ప్రారంభించిన సచివాలయ వ్యవస్థలో రైతు సేవలు, హెల్త్ క్లినిక్ సేవలకు అవసరమైన భవన వసతి లేదు. వీటిని ఇరుకు గదుల్లో నిర్వహించాల్సి వస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో వివిధ దశల్లో నిలిచిపోయిన భవనాలకు నిధులు విడుదల చేసి పూర్తి చేయడం ద్వారా అన్ని సేవలు గ్రామాల్లోనే ప్రజలకు చేరువయ్యే అవకాశం ఉంది.

– తట్టా పెంటయ్యనాయుడు, సర్పంచ్, తుమ్మపాల

## స్టీల్‌ప్లాంట్‌కి గనులు కేటాయించాలని నిరసన



నాలుగురోడ్ల జంక్షన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ, సీపీఎం నాయకులు

**అనకాపల్లి టౌన్:** స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ శంకరరావు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక నాలుగురోడ్ల జంక్షన్‌లో పార్టీ శ్రేణులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల ప్యాకేజీ ప్రకటించి చేతులు దులుపుకోవాలని చూస్తుందని విమర్శించారు. ఆ డబ్బులు ప్లాంట్ నిర్వహణకు ఏమాత్రం సరిపోవన్నారు. ఎంపీ సీఎం రమేష్ ఎన్నికలలో స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. దానికి కట్టుబడి ఉండి గనులను సాధించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంట శ్రీరామ్, ఏ రాజు, కే తేలయ్యబాబు, జీ సుభాషిణి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## 'కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారు?'

**అనకాపల్లి టౌన్:** అనర్హత పేరుతో సామాజిక పింఛన్లు తొలగిస్తున్న కూటమి ప్రభుత్వం అర్హులైన వారికి కొత్తవి ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు చిన్ని యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనర్హత పేరుతో సామాజిక పింఛన్లను అడ్డగోలుగా తొలగిస్తున్నారన్నారు. పైలట్ సర్వే పేరులో అర్హులైన పేదలను తొలగిస్తే ఉద్యమిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు అయినా కొత్త పింఛన్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.

## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**అనకాపల్లి టౌన్:** పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆలయ మండపంలో పాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా 108 మంది మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. లక్ష్మీదేవి ప్రతిమలకు అష్టోత్తర నామాలతో పూజ, పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### స్వీయ రక్షణకు కరాటే



బాలికలకు కరాటేలో ఇస్తున్న శిక్షణ

**కశింకోట:** స్వీయ రక్షణకు కరాటే దోహదం చేస్తుందని ఎస్ఐ కె. లక్ష్మణరావు అన్నారు. స్థానిక సమగ్ర బాలికల వసతి గృహంలో 150 మంది బాలికలకు కరాటేలో శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. దీన్ని ఎస్ఐ ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల స్వీయ రక్షణ నైపుణ్యాలు బాలికలకు అలవడతాయన్నారు. ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. కరాటే ఉపాధ్యాయుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమ అధికారి నిర్మల, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

### సాయికిరణ్‌కు అభినందన



మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను కలిసిన పల్లెల సాయికిరణ్

**తుమ్మపాల:** అనకాపల్లి జిల్లా పార్టీ ఐటీ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన పల్లేల సాయికిరణ్‌ను వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అభినందించారు. ఆయన్ను సాయికిరణ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు

### షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

**కె.కోటపాడు:** కింతాడ పంచాయతీ జోగన్నపాలెం నివాసి బండారు లక్ష్మి ఇంట్లో శుక్రవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ అయి ఫ్రిజ్, గ్రైండర్, ఫ్యాన్‌లు, చీరలు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ సమయంలో భయంతో బయటికి పరుగులు తీశామని ఆమె తెలిపారు. సర్వస్వం కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలినట్లు పేర్కొంది. లక్ష్మి ఇంటిని స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ముత్యాలనాయుడు పరామర్శించి ఆమెను ఓదార్చారు. జరిగిన ఘటనను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాయపడాలని కోరనున్నట్లు ఆమెకు సర్పంచ్ ఈశ్వరమ్మ తెలిపారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 4,580 దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ఠ ధర | గరిష్ఠ ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 3,600 | 4,500 |
| మొదటి రకం | 3,520 | 4.120 |
| రెండో రకం | 3,310 | 3,750 |
| మూడో రకం | 3,000 | 3,290 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ | :రాజా |
| ఆఫీసర్ ఆన్ డ్యూటీ | :సత్యనారాయణ స్క్రీన్-1 |
| యుగానికి ఒక్కడు | :సత్యనారాయణ స్క్రీన్-2 |
| కోర్ట్ | :పర్తిసాయి |
| దిల్‌రూబా | :షిర్డీసాయి |
| థౌజండ్ వాలా | :వెంకటేశ్వర(ఉదయం) |
| న్యూ పోలీస్ స్టోరీ | :వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు) |
| తండేల్ | :శ్రీసత్య |
| ఛావా | :రామచంద్ర |

### రక్త నిల్వలు

**అనకాపల్లి:** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 91 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13యూనిట్లు, బీ పాజిటివ్-34 యూనిట్లు, ఓ పాజిటివ్-37 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

## బదిలీల్లో ఉపాధ్యాయులకే ఆప్షన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న తుంపాల వెంకటరమణ

**అనకాపల్లి టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న ఉపాధ్యాయ బదిలీల్లో నేరుగా ఉపాధ్యాయులు ఆప్షన్ ఎంచుకునే విధంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ కోరారు. స్థానిక సీపీఐ గోవిందరావు భవనంలో శుక్రవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీలకు సంబంధించి అన్ని సమస్యలను ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి సభ్యుడు డాక్టర్ వేపాడ చిరంజీవి ద్వారా మంత్రికి వివరిస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా బదిలీల్లో మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. తప్పుల తడకగా ఉన్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను సవరించాలని, ఉపాధ్యాయులను యాప్ భారం నుంచి పూర్తిగా మినహాయించాలని కోరారు. ఉపాధ్యాయ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు రొంగలి అప్పలరాజు, సంఘం ప్రతినిధులు కోట్ని రాంబాబు, వీరునాయుడు, లక్ష్మణ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలం ఆక్రమించి అనధికార నిర్మాణం



బస్సు షెల్టర్ స్థలంలో పూర్తిచేసిన పునాది

**తుమ్మపాల:** పల్లెల్లో కూటమి నాయకులు బరితెగిస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారు. మండలంలో మారేడుపూడి రెవెన్యూ పరిధి తారకరామా కాలనీలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సర్వే నంబరు 354లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. అంతటితో ఆగకుండా అనధికార భవనాన్ని నిర్మిస్తున్నారు. మారేడుపూడి, వెంకటరమణయ్యపేట, అక్కిరెడ్డిపాలెం, మడకపాలెం గ్రామాలకు ప్రధానమైన ఎన్టీఆర్ విగ్రహం జంక్షన్ వద్ద బస్సు షెల్టర్‌తో పాటు సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాన్నీ కూటమి నాయకులు వదలడం లేదు. వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మను తొలగించి శరవేగంగా నిర్మాణాన్ని చేపడుతున్నారు. దీనిపై గ్రామస్తులు వీఆర్వో దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. తక్షణమే రెవెన్యూ, పంచాయతీ అధికారులు దృష్టి సారించి ఆక్రమణ నిలిపివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.

## అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాత రామకృష్ణకు బాండ్ అందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ



దాత బాలకృష్ణకు బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి పెందుర్తి దరి సుజాతనగర్‌కు చెందిన దొగ్గ రామకృష్ణ రూ.లక్ష, నెల్లూరు జిల్లా కావలి మండలం పాతపెంట గ్రామానికి చెందిన వి.బాలకృష్ణ రూ.లక్ష 116 విరాళాన్ని అందించారు. కుటుంబ సమేతంగా సింహగిరికి వచ్చిన దాతలు సంబంధిత విరాళాలను నగదు రూపంలో సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలోని విరాళాల స్వీకరణ కౌంటరులో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతలకు ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్‌లు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

## ముగిసిన సహస్ర పూర్ణచంద్ర దర్శనోత్సవం



మహా మృత్యుంజయ హోమం, పూర్ణాహుతిలో పాల్గొన్న గురుమాత అన్నపూర్ణమ్మ తదితరులు

**సబ్బవరం:** ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో సహస్ర పూర్ణచంద్ర దర్శనోత్సవం గురుపాదుకా పూజతో శుక్రవారం ముగిసింది. గురువారం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా నవగ్రహ మండపం, బ్రహ్మ మండపం, సర్వతోభద్ర మండపం, రుద్ర మండపం, కలశ స్థాపన పూజలు జరిగాయి. రుత్వికులు మృత్యుంజయ జపాలు, నవగ్ర జపాలు, ఆయుష్య సహిత పారాయణ, జన్మ నక్షత్ర జపాలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాలతో పాటు యూఎస్ఏ, యూకే, కెనడా తదితర విదేశాల నుంచి వచ్చిన అనేక మంది శిష్యులు వచ్చారు. ఉదయం నుంచి వల్లభేశక్షేత్ర పాల దశ మహావిద్య సహిత విద్యామ్నయ కలశ స్థాపన, లలితా సహస్ర నామార్చనలు జరిపారు. సాయంత్రం 4 నుంచి గురుపాదుకా పూజ, నృత్యాలు, భజనలతో పాటు అమృత కన్యా గురుకులం బాలికలు సైన్స్ ప్రాజెక్ట్ ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మూర్తి, వార్డెన్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## 21న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద మహాధర్నా

**చోడవరం:** చెరకు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 21వ తేదీన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద మహాధర్నా నిర్వహించేందుకు ప్రజా సంఘాలు, సీపీఎం, సీఐటీయూ అఖిలపక్ష సమావేశం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చోడవరం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రైతుల సమస్యలు తెలిపేందుకు మహాధర్నా నిర్వహిస్తున్నామని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు చెప్పారు.

## 28న నూకాంబిక జాతర



కరపత్రం విడుదల చేస్తున్న రామకృష్ణ

**అనకాపల్లి టౌన్:** పట్టణంలోని తాకాశివీధిలో వెలసిన నూకాంబిక అమ్మవారి జాతర ప్రచార కరపత్రాలను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న జాతర, 29న కొత్త అమావాస్య సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ తాకాశి కిశోర్, కమిటీ మెంబర్స్, జనసేన నాయకులు తాకాశి కన్నబాబు, శ్రీరాందాస్ గోవిందు, తాడి రామకృష్ణ, తాకాసి సత్యందొర, అప్పికొండ గణేష్ పాల్గొన్నారు.

## చెరువుల ఆక్రమణలపై చర్యలకు డిమాండ్

**కశింకోట:** మండలంలోని గొబ్బూరు వద్ద గైరమ్మ సాగు నీటి చెరువు, కిత్తయ్య చెరువుల్లో ఆక్రమణలు తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని గొబ్బూరుకు చెందిన రైతు బుద్ధ వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అమీన్‌సాహెబ్‌పేట వద్ద సిమెంట్ పరిశ్రమ గైరమ్మ చెరువును ఆక్రమించి సర్వీసు రోడ్డు, కిత్తయ్య చెరువును ఆక్రమించి వంతెనను నిర్మించిందని, ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల సర్వేలో ఇటీవల గుర్తించారన్నారు. వీటిని తొలగించి ఆయకట్టుకు సాగునీటికి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమ కాలుష్యం వల్ల చుట్టు పక్కల పంటలు పడటం లేదని రైతులు నష్టపోతున్నారని, దీని బారి నుంచి కాపాడాలని కోరారు.

## గిరిజనుల వద్ద ప్రభుత్వమే జీడిపప్పు కొనుగోలు చేయాలి



సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

**రోలుగుంట:** మండలం రత్నంపేట పంచాయతీ శివారు పనసలపాడు గ్రామంలో శుక్రవారం జీడిపప్పు ధర నిర్ణయించి, ప్రభుత్వమే విక్రయించాలనే డిమాండ్‌తో కూడిన కరపత్రాలతో గిరిజనులు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టినా గిట్టుబాటు ధర లేక పడుతున్న ఇక్కట్లు తెలిపారు. పెట్టుబడులకు తగ్గట్లు కిలో రూ. 200గా నిర్ణయించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి సిండికేట్ల నుంచి కాపాడాలని కోరారు. సీపీఎం నాయకుడు ఇ.చిరంజీవి మాట్లాడుతూ జీడి పిక్కల పంట కోసం ప్రత్యేక కార్పొరేషన్, ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి గిరిజనులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## వృద్ధుడి హత్య కేసులో నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ అప్పలరాజు

**చోడవరం:** తీవ్రంగా గాయపరిచి వృద్ధుడి మృతికి కారకుడైన నిందితుడు నేమాల హరిని అరెస్టు చేసినట్టు చోడవరం సీఐ అప్పలరాజు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈనెల 4వ తేదీన చోడవరం బాలాజీనగర్‌కు చెందిన ఇందల సన్యాసిరావు అనే వృద్ధుడితో బానీకోనేరుకు చెందిన నేమాల హరి ఘర్షణ పడి తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. సన్యాసిరావు తలకు బలమైన గాయమై విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 12వ తేదీన మృతి చెందాడని సీఐ చెప్పారు. నిందితుడు హరిని చోడవరం ఐటీఐ కాలనీ సమీపంలో అరెస్టు చేసి కోర్టుకు తరలించామని సీఐ తెలిపారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించిందని ఆయన పేర్కొన్నారు.

## కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు



ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

**తుమ్మపాల:** ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 14వ రోజుకు చేరుకున్నాయి. పట్టణంలో ఆర్టీసీ డిపో వద్ద ఏపీపీటీడీ జాతీయ మజుదూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన జోనల్ జాయింట్ సెక్రటరీ జి.శంకరరావు మాట్లాడుతూ సీ, టీ కేసుల విధానం అమలు చేయకుండా అన్యాయంగా చార్జిషీట్లు నమోదు చేసి సస్పెన్షన్ చేస్తున్నారన్నారు. 1/19 సర్క్యులేషన్ ప్రకారం అలాంటి కేసుల్లో పాయింట్ల విధానం అమలు చేయాలన్నారు. మరో అతిథి రీజనల్ సెక్రటరీ పి.సుధాకర్ శిబిరానికి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఏఎస్ రావు, విశాఖపట్నం -1 డిపో సీసీఎస్ డెలిగేట్ సీహెచ్ఎస్ నారాయణ, కోశాధికారి కేఆర్ఎం రావు, కమిటీ సభ్యులు కేపీకే రావు, కార్మికులు పాల్గొన్నారు.

## విగ్రహాలకు ముసుగు.. అధికారుల లొసుగు



కశింకోట ప్రధాన రహదారిలో వైఎస్సార్ విగ్రహానికి తొలగించని ముసుగు



కశింకోటలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహానికి తొలగించని ముసుగు

**కశింకోట:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ముగిసి కోడ్ ఎత్తివేశారు. అయినప్పటికీ రాజకీయ విగ్రహాలకు వేసిన ముసుగులు మాత్రం ఇంకా తొలగించడం లేదు. కశింకోట ప్రధాన రహదారిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తదితర విగ్రహాలకు ఎన్నికల నిబంధనలు దృష్ట్యా ముఖాలకు తొడిగిన ముసుగులు మాత్రం తొలగించకపోవడంతో ఆయా పార్టీల నాయకులు విస్తుపోతున్నారు. సత్వరమే నేతల విగ్రహాలకు ముసుగులు తొలగించాలని కోరుతున్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



బోల్తా పడిన ట్రాక్టర్

**నాతవరం:** ప్రమాదశావత్తు ట్రాక్టర్ బోల్తా పడి సంఘటనా స్థలంలోనే డ్రైవర్ మరణించాడు. నాతవరం ఎస్ఐ సీహెచ్ భీమరాజు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన పెదపాత్రుని సత్యనారాయణ (59) శుక్రవారం సాయంత్రం తన గ్రామం నుంచి వరి గడ్డి ట్రాక్టరుపై నాతవరం మండలం గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం గ్రామానికి వచ్చాడు. ఈ గ్రామంలో వరి గడ్డి అన్‌లోడ్ చేసి తిరిగి స్వగ్రామం అల్లిపూడి ట్రాక్టరుపై వెళ్లిపోతున్నాడు. చిక్కుడుపాలెం గ్రామ సమీపంలో రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పి ట్రాక్టరు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ సంఘటనా స్థలంలోనే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పిల్లలు చదువుకుంటున్నారు. ఇంకా వివాహం కాలేదు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్యాపిల్లలు బోరున విలపిస్తున్నారు. మృతుడి కుమార్తె నాగమణి ఫిర్యాదు మేరకు నాతవరం ఎస్ఐ సీహెచ్ భీమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆనందోత్సాహాలతో హోలీ

**కశింకోట:** హోలీ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలు వీధుల్లో కేరింతలు కొడుతూ తిరిగి రంగులు జల్లారు. పెద్దలు పరస్పరం రంగులు జల్లుకున్నారు. పిల్లలు ప్రత్యేక పిచికారీ గొట్టాలతో దారిన పోయేవారికి రంగులు వెదజల్లి కేరింతలు కొట్టారు. ఇక్కడి ఇటుకల బట్టీల్లో పని చేసే ఒడిశా కార్మికులు, కుటుంబీకులు రంగులు జల్లుకొని హోలీ పండుగ ఉత్సాహంగా జరుపుకున్నారు. పాఠశాలలకు సెలవు కావడంతో కశింకోట, తాళ్లపాలెం, బయ్యవరం, తేగాడ, కన్నూరుపాలెం, గొబ్బూరు, తదితర గ్రామాల్లో చిన్నారులు సైతం ఒకరికొకరు రంగులు రాసుకుంటూ, ఉల్లాసంగా గడిపారు.